

ఇన్‌చార్జి డీపీవో నియామకం

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఇన్‌చార్జి డీపీవో, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులను నియమించారు. ఈ మేరకు సోమవారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మన్యం డీపీవోగా పనిచేసిన బి.సత్యనారాయణ, పంచాయతీరాజ్ జిల్లా ఇంజనీరింగ్ అధికారిగా విధులు నిర్వర్తించిన కృష్ణాజీ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. దీంతో వారి స్థానంలో ఇన్‌చార్జి డీపీవోగా డ్వామా పీడీ రామచంద్రరావు, ఇన్‌చార్జి పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారిగా రవిని నియమిస్తూ.. వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పాలకొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రవి పనిచేస్తున్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

- ఏజెన్సీలో కొంతమంది పీఎంఏవై లబ్ధిదారులకు అందని బిల్లులు
- గ్రీన్ మార్క్‌లోకి వారి ఇళ్ల జాబితా.. సాగని గృహ నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా.. పరిష్కారం కాని సమస్య
- నాలుగు మండలాల్లో బాధితులు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం

(జియ్యమ్మవలస)

జిల్లాలోని ఏజెన్సీలో కొంతమంది పీఎంఏవై (గ్రామీణ్) లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. వారి ఇళ్ల నిర్మాణాలకు మోక్షం లభించడం లేదు. పలుమార్లు ఉన్నతాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం. నేటికీ బిల్లులు అందకపోవడంతో.. అప్పులు చేసి మరీ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తికాని పరిస్థితి.. ఏం చేయాలో తెలియక లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవంగా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందని చెప్పడంతో ఏళ్ల తరబడి పూరిపాకల్లో జీవిస్తున్న గిరిజనులు ఎంతో సంబరపడ్డారు. మరోవైపు అధికారులు కూడా ప్రోత్సహించడంతో అతి కష్టం మీద గిరి శిఖరాలకు ఇసుక, సిమెంటు, ఇనుము, తదితర ముడి సరుకులు తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు ఉండగా.. కొంతమంది పీఎంఏవై (గ్రామీణ్) లబ్ధిదారులకు మాత్రం బిల్లులు మంజూరవ్వలేదు. అధికారుల వద్దకు వెళ్లి తమ గోడు వినిపించినా ప్రయోజనం లేకపోయింది. కారణం వీరి ఇళ్ల జాబితా గ్రీన్ మార్క్‌లో ఉండిపోవడమే.

చేతులెత్తేసిన అధికారులు

ఒక్కో లబ్ధిదారునికి రెండేసి చొప్పున బ్యాంకు ఖాతాలు ఉండడం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్‌కు లింక్ కాకపోవడం వంటి సాంకేతిక కారణాలతో వారి ఇళ్ల జాబితా గ్రీన్‌మార్క్‌లో ఉండిపోయాయని అధికారులు చెబుతున్నారు. అయితే వారి సూచనల మేరకు గిరిజన లబ్ధిదారులు ఖాతాలను సరిచేసుకున్నా.. నేటికీ గ్రీన్‌మార్క్ సమస్య పరిష్కారం కాలేదు. ఒక్కసారి గ్రీన్‌మార్క్‌లోకి వెళ్లిన తర్వాత తామేమి చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేకపోతున్నామని, మరోవైపు అప్పులకు వడ్డీ చెల్లించలేకపోతున్నామని వారు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాలోని 12 మండలాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకంలో 7,306 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిల్లో జియ్యమ్మవలస మండలానికి 1,839, కురుపాం 1,211, సీతంపేటకు 1,109 చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి. కొమరాడకు 8, పాచిపెంట మండలానికి 70 చొప్పున ఇళ్లు కేటాయించారు. ఈ మేరకు 2022లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టారు. వివిధ స్థాయిల్లో సిమెంటు, బిల్లులను గృహ నిర్మాణశాఖ అధికారులు చెల్లించారు. అయితే కొందరికి మాత్రం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఒక్క పైసా కూడా బిల్లు కాలేదు. దీంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారి ఇళ్ల బిల్లులను మళ్లీ అప్‌లోడ్ చేసినా ఫలితం లేకపోయింది. కాగా వారి ఇళ్ల జాబితా ఆన్‌లైన్‌లో గ్రీన్‌మార్క్‌లో ఉండడంపై మండల సర్వసభ్య సమావేశాల్లో సదరు పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గృహ నిర్మాణశాఖ అధికారులను నిలదీసినా సమస్య పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బంది సమాధానమిచ్చి తప్పించుకున్నారు. ఏదేమైనా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ ఇళ్ల పరిస్థితిపై అప్పటి ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంపై గిరిజన లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు.



కొండచిలకాంలో గ్రీన్‌మార్క్‌లో ఉన్న ఇళ్లు ఇవే..

- జియ్యమ్మవలస మండలం కొండచిలకాం పంచాయతీలో మొత్తం 157 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ గ్రామంలో నిమ్మక భోగమ్మ, సుకవాని, మండంగి సుభాష్, పువ్వల రత్నాలమ్మ, ఊయక రాధ, ఊయక గౌరమ్మలకు చెందిన ఇళ్లు గ్రీన్ మార్క్‌లో ఉండిపోయాయి. గుమ్మలక్ష్మీపురం మండలం జర్న పంచాయతీలో కిల్లక తాడమ్మ, ఊయక మిన్నారావు, కిల్లక ఎల్లమ్మ, కురుపాం మండలం పెదగొత్తిలి పంచాయతీలో ఊయక చిన్నమ్మి, లలిత, వీరఘట్టానికి చెందిన దాకారపు చిన్నమ్మాయి ఇళ్లు కూడా గ్రీన్ మార్క్‌లోనే ఉన్నాయి. మొత్తంగా 12 మంది లబ్ధిదారులు రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమ సొంతింటి కలను నెరవేర్చాలని గిరిజన లబ్ధిదారులు కోరుతున్నారు.

రూ.2 లక్షల వరకూ అప్పు చేశా..

నాకు ఇల్లు మంజూరైందని తెలియగానే.. అప్పు చేసి మరీ గృహ నిర్మాణం చేపట్టాను. ఇందుకోసం తెలిసిన వారి నుంచి రూ.2 లక్షల వరకూ అప్పు చేశా. అయితే రెండేళ్లు గడుస్తున్నా.. బిల్లులు రాలేదు. ఇంటి నిర్మాణం సగంలోనే నిలిచిపోయింది. మరోవైపు అప్పులకు వడ్డీ చెల్లించలేకపోతున్నా. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. గ్రీన్‌మార్క్‌లో మా ఇల్లు ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

- ఊయక రాధ, కొండచిలకాం, జియ్యమ్మవలస మండలం

ఉన్నతాధికారులకు తెలియజేశాం

జియ్యమ్మవలస మండలంలో కొండచిలకాం పంచాయతీకి చెందిన కొందరు లబ్ధిదారుల ఇళ్లు గ్రీన్ మార్క్‌లో ఉన్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. దీనిపై వారే స్పందించాలి.

- ఎల్.ఉమామహేశ్వరరావు, ఏఈ, గృహ నిర్మాణశాఖ, జియ్యమ్మవలస

ఏజెన్సీలో సౌర వెలుగులేవీ?

- సూర్యఘర్ పథకంపై ఆసక్తి చూపని గిరిజనులు
- యూనిట్ కాస్ట్, డిపాజిట్ చెల్లింపు భారంతో వెనకడుగు
- గిరిశిఖర గ్రామాల్లో అనుకూలంగా లేని పరిస్థితులు



విద్యుత్ సౌకర్యానికి నోచుకోని గూడంగి గ్రామం

సీతంపేట: సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచి.. సామాన్యులపై కరెంట్ చార్జీల భారం తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అయితే సీతంపేట మన్యంలో ఈ పథకం సక్రమంగా అమలు కావడం లేదు. యూనిట్ కాస్ట్ ఎక్కువగా ఉండడం, ఒకేసారి డిపాజిట్ చెల్లించడం, మరోవైపు గిరిశిఖర గ్రామాల్లో అనుకూల పరిస్థితులు లేకపోవడంతో గిరిజనులు ముందుకు రావడం లేదు. మొత్తంగా గిరిజన ప్రాంతాల్లో సౌర వెలుగులు కానరావడం లేదు.

ఇదీ పరిస్థితి..

- పాలకొండ నియోజకవర్గం పరిధి సీతంపేట, భామిని, వీరఘట్టం, పాలకొండ మండ లాల్లో సుమారు 12 గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. పీఎం జన్‌మాన్‌లో భాగంగా ఆయా గ్రామాలకు విద్యుత్ సౌక ర్యం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. అయితే కొండ శిఖర గ్రామాలకు రోడ్లు లేకపోవడంతో స్తంభాలు వెళ్లే పరిస్థితి లేదు. మరోవైపు ట్రాన్స్‌పోర్టుకు ఖర్చు ఎక్కువ అవడంతో సోలార్ వెలుగులు అందిం చాలని ట్రాన్స్‌కో సిబ్బంది భావించారు. అయితే పవర్ గ్రిడ్‌కు సోలార్‌ను అనుసంధానం చేస్తుండడంతో గిరిజన గ్రామాల్లో కరెంట్ సౌకర్యం ఉంటేనే సౌర వెలుగులు. లేకుంటే సోలార్ సిస్టమ్ పనిచేయదు. దీనికోసం అద నంగా ఇన్వర్టర్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. దీంతో అత్యధికులు సోలార్ విద్యుత్‌పై ఆసక్తి చూపడం లేదు.
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే పీఎం సూర్యఘర్ యోజన కింద 147 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 37 మందికి సోలార్ రూఫ్‌టాప్‌ను వినియో గిస్తున్నారు. మన్యం జిల్లాలోని పాలకొండలో ముగ్గురు దరఖాస్తులు పెట్టుకోగా ఇద్దరు సౌర విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. మరొకరి దరఖాస్తు పరిశీలనలో ఉంది. ముందుగా వినియోగదారుడు వన్ కేవీ ప్యానెల్ బోర్డు ఏర్పాటు చేసుకుంటే రూ.83 వేలు చెల్లించాలి. ప్రభుత్వం తిరిగి సబ్సిడీ కింద రూ.30 వేలు ఇస్తుంది. 2 కేవీ కోసం రూ. 1,44,000 కడితే తిరిగి రూ.60 వేలు చెల్లిస్తారు. కాగా గృహ అవసరాల నిమిత్తం 2 కేవీ ఏర్పాటు చేసుకుంటే.. బిల్లుల ఆదా అవడంతో పాటు మిగిలిన కరెంట్‌ను ట్రాన్స్‌కో వారికి విక్రయిస్తే.. కొంత నగదు కూడా వస్తుంది. అయితే గిరిశిఖర, మైదాన గిరిజన గ్రామాల్లో ఆ పరిస్థితి లేదు. మైదాన ప్రాంతాల్లో గిరిజనులకు ఇప్పటికే ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తుంది. ఇక కరెంట్ సౌకర్యం లేని గిరిశిఖర గ్రామాల్లో సౌర విద్యుత్ పనిచేయని పరిస్థితి. మరోవైపు యూనిట్ కాస్ట్, డిపాజిట్ చెల్లింపులు గిరిజనులకు భారంగా మారాయి. ఈ తరుణంలో సీతంపేట మన్యంలో పీఎం సూర్యఘర్ పథకం ఎంతవరకు అమలవుతుందో.. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. ఈ విషయమై ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణమూర్తిని వివరణ కోరగా.. పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకం అమలుపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.





పండగ నిర్వహణ ఎలా?

- ఉత్సవ కమిటీయా.. ధర్మకర్తల మండలినా?
- సిరిమానోత్సవానికి సమీపిస్తున్న గడువు
- 10న కీలక సమావేశం?

విజయనగరం రూరల్: పైడిమాంబ పండగకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ ఏడాది సిరిమానోత్సవాన్ని ఉత్సవ కమిటీ నిర్వహిస్తుందా లేక ధర్మకర్తల మండలి చూస్తుందా అన్నది స్పష్టత రాలేదు. ఈ నెల 10 నుంచి దేవస్థానం, అర్చకులు పూర్తిస్థాయిలో పండగ ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభించగా, మరికొన్ని పనులు వినాయక చవితి అనంతరం ఈ నెల 10నుంచి చేపట్టనున్నారు. సిరిమానోత్సవానికి ముందే.. పైడిమాంబ దేవస్థానానికి ధర్మకర్తల మండలిని నియమిస్తారా? లేకుంటే.. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసి సిరిమానోత్సవ ప్రక్రియను నిర్వహిస్తారా? అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయాలంటే దేవదాయశాఖ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాలకు ఒకేసారి నోటిఫికేషన్ ఇస్తుంది. ఆ ప్రకారం ధర్మకర్తల మండలి ఏర్పాటు ప్రక్రియ జరగనుంది. ఈ తంతు ఆలస్యం కావొచ్చు. ఈ పరిస్థితిలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఇది ఏర్పాటు చేయాలన్నా స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కలెక్టర్ ద్వారా దేవదాయశాఖకు లేఖ రాయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే దేవదాయశాఖ ఉత్సవ కమిటీ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంటుంది. గతంలో కూడా ధర్మకర్తల మండలి ఏర్పాటులో జాప్యం జరిగిన సందర్భంలో ఉత్సవ కమిటీ ద్వారానే సిరిమానోత్సవం జరిగింది.

- ఈ నెల 10న సిరిమానోత్సవ ఏర్పాట్లపై కీలక సమావేశం జరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీతో పాటు సిరిమానోత్సవంలో భాగస్వాములు కానున్న వివిధ ప్రభుత్వ శాఖలు, దేవదాయశాఖ తదితర వాటితో సమీక్ష జరగనుంది. ఆ సమావేశంలో పండగ నిర్వహించేది ధర్మకర్తల మండలా? లేకుంటే ఉత్సవ కమిటీయా? అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



విపత్తు ప్రణాళిక తప్పనిసరి: కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రతి మండలంలో విపత్తు యాజమాన్య ప్రణాళిక ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో చెరువులు, వాటిల్లో ప్రమాదకర పరిస్థితులు, రహదారులపై వరద నీరు పారే ప్రదేశాలు, శిథిలావస్థలో ఉన్న వంతెనలు, అంగన్‌వాడీ, పాఠశాల, వైద్యశాల భవనాలు గుర్తించాలని సూచించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రానున్న మూడు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అధికారులంతా సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

స్వపక్షంలో విపక్షం

- పార్వతీపురం వైసీపీలో లుకలుకలు
- చైర్‌పర్సన్‌పై కొంతమంది కౌన్సిలర్ల అసంతృప్తి
- ఆమెకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న వైనం
- ఇటీవల కౌన్సిల్ సమావేశంలోనూ వాకౌట్
- చర్చనీయాంశమవుతున్న అంతర్గత విభేదాలు
- ఈ పరిణామాలపై మౌనంగా ఉన్న టీడీపీ



పార్వతీపురం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురం వైసీపీలో లుకలుకలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు, ఆ పార్టీ నుంచి ఎన్నికైన చైర్‌పర్సన్‌కు ఏ మాత్రం పొసగడం లేదు. దీంతో ఆమెకు వ్యతిరేకంగా వారు పావులు కదుపుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మొత్తంగా మున్సిపాల్టీలో వారు స్వపక్షంలో విపక్షంగా మారారనే వ్యాఖ్యలు గట్టిగా వినిపిస్తున్నాయి.

గత పురపాలక సంఘ ఎన్నికల్లో వైసీపీ అధిష్ఠానం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గౌరీశ్వరిని ఎంపిక చేసింది. అయితే చాలా మంది ఆ పార్టీ కౌన్సిలర్లు ఈ పదవి కోసం పోటీపడ్డారు. చివరి నిమిషంలో గౌరీశ్వరి వైపే వైసీపీ అధిష్ఠానం మొగ్గు చూపడంతో అనూహ్యంగా ఆమె చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. అప్పట్లో బోను గౌరీశ్వరి కొంతకాలం, ఆ స్థానం ఆశించిన వైసీపీ కౌన్సిలర్లలో ఎవరికో ఒకరు మరికొంతకాలం చైర్మన్‌గా వ్యవహరిస్తారని పార్టీ పెద్దలు చెప్పి అందర్నీ శాంతింపజేశారు. దీంతో అప్పటి నుంచి కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు అసంతృప్తితోనే పాలకవర్గంలో కొనసాగుతున్నారు. తాజా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాటను జవదాటకుండా ముందుకు సాగారు. కాగా చైర్‌పర్సన్ పీఠం గౌరీశ్వరిదే అయినా.. అప్పట్లో ఎమ్మెల్యే జోగా రావు అన్నీ తానై చక్రం తిప్పారు. అధికారులను తన చెప్పుచేతల్లోనే ఉంచుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే అప్పుడు పార్టీ అధికారంలో ఉండడంతో వైసీపీ నేతలతో పాటు కౌన్సిలర్లు, అధికారులు కూడా ఎదురుచెప్పలేని పరిస్థితి. కాగా ఎన్నికల ముందే గౌరీశ్వరిని మార్చాలని కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ ఉంటుందని ఆ పార్టీ తాజా మాజీ ఎమ్మెల్యే జోగారావు చెప్పుకుంటూ వచ్చారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత ఒక్కసారిగా పార్వతీపురంలో సీన్ మారింది. తీవ్ర అసంతృప్తితో ఉన్న కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు ప్రత్యక్షంగానే చైర్‌పర్సన్‌పై తమ వ్యతిరేకతను తెలియజేస్తున్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ ఆమె వైఖరికి నిరసనగా వాకౌట్ చేశారు.

కొంతమంది టీడీపీ వైపు...

చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఉన్న కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పట్టణంలోని ఇద్దరు టీడీపీ ముఖ్య నాయకులతో టచ్‌లోకి వెళ్లినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం పాలకవర్గంలో నలుగురు టీడీపీ కౌన్సి లర్లు ఉన్నారు. మిగిలిన వారందరూ వైసీపీ కౌన్సిలర్లే.. చైర్‌పర్సన్ పీఠం దక్కాలంటే ఎంతో వ్యూహంతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అయితే దీనిపై టీడీపీ నాయకులు మౌనంగానే ఉన్నారు. ఆ పార్టీ వైఖరి ఏమిటనేది స్పష్టం కాకపోవడంతో కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు బయటపడలేని పరిస్థితి నెలకొంది. పాలకవర్గం తమ చేతిలోకి వస్తే ఎమ్మెల్యే విజయచంద్ర సహకారంతో మున్సిపాల్టీని అభివృద్ధి పథంలో నడిపించొచ్చని కొంతమంది ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకులు భావిస్తున్నారు.

ఇంతకాలం చైర్మన్ కుర్చీ కోసం ఎంతగానో ఎదురుచూసిన కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు నిరాశే ఎదురవగా పాలకవర్గంలోనూ తగిన ప్రాధాన్యం లేదు. దీంతో కుర్చీ నుంచి చైర్‌పర్సన్‌ను దించి మరొకరిని అక్కడ కూర్చోబెట్టాలని భావిస్తున్నట్లుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తంగా వైసీపీలో అంతర్గత విభేదాలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి.







కిడ్స్ డైట్

అమ్మ చేతి గోరుముద్ద!

పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం. పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

అమ్మమ్మల ఆహారం!

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు. అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్ధకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడోల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

పేచీ పెట్టే పిల్లలతో ఇలా...

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది. ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

> **పిల్లల ఆహారం పసందుగా...**
>
> అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు.. ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.



పోషకాల చిరుతిళ్లు ఇవే!

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చి కూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు. షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

ఆకలి తెలియనివ్వాలి

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు. కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

గ్యాస్ వేధిస్తుంటే..

వేళకు తినకపోవడం, తిన్నా అరగకపోవడం చాలా మందికి ఎదురయ్యే సమస్య. వేపుళ్లు, జంక్ ఫుడ్, అధిక నూనెతో వండిన వంటకాలను తినటం వల్ల గ్యాస్ పెరిగి కడుపుబ్బరం సమస్య ఎర్పడుతుంది. దీనికి చిన్న చిట్కాలతో పరిష్కారం లభిస్తుంది. అవేమిటో చూద్దాం..

సమస్య మూలమిది: మనం తిన్న ఆహారం కడుపులోకి వెళ్లిన తరువాత.. జీర్ణం అవుతుంది. ఆ జీర్ణప్రక్రియలో కొన్ని రకాల వాయువులు విడుదలవుతాయి. కొన్ని సార్లు. అవి బయటికి వెళ్లకుండా కడుపులోను, పేవులలోను పేరుకుపోతాయి. అవి చెడువాయువులుగా మారి ఇబ్బంది పెడతాయి. ఆయుర్వేదంలో ఈ సమస్యను ఆర్పానం, ఆటోపం అంటారు. ఈ వాయువులు బయటకు వెళ్లకపోతే ఆ ప్రభావం గుండె.. ఊపిరితిత్తులపై పడుతుంది. గుండె దడ, ఆందోళన, గుండెల్లో నెప్పి మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా పల్చటి మజ్జిగ తాగితే ఈ సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.

చిట్కాలివే: అరిటి బోద లోపల తెల్లటి పదార్థం ఉంటుంది. దీని రసాన్ని రోజుకు ఒక కప్పు చొప్పున 15



రోజులు తాగితే గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

- అల్లం రసం తీసి దానిని వేడిచేసి తగినంత బెల్లం కలపాలి. ఇలా కలిపిన మిశ్రమాన్ని రోజుకు ఒక స్పూను తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కడుపుబ్బరం తగ్గిపోతుంది.
- గింజలున్న ఎండిన నల్ల ద్రాక్షను తీసుకొని నీళ్లలో ఆరు గంటలు నానబెట్టాలి. ఇలా నానిన ద్రాక్ష రసాన్ని తాగితే గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- శొంఠిపొడి, పాత బెల్లంపొడిలను సమ పాళ్లలో కలుపుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఒక స్పూను తినాలి. ఆ తర్వాత వేడి నీళ్లు తాగాలి. ఇలా తాగితే కడుపులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- ధనియాలు, శొంఠిలను సమపాళ్లలో తీసుకొని.. వేడి నీటిలో మరిగించాలి. అలా తయారయిన కషాయాన్ని తాగి నడిస్తే- గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- సోంపు, జీలకర్ర, వాములను సమపాళ్లలో తీసుకొని పొడి చేయాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం ఒక స్పూను చొప్పున వేడి నీళ్లలో వేసుకొని తాగాలి. ఇలా తాగితే వారం రోజుల్లో గ్యాస్ సమస్య తొలగిపోతుంది.

బ్లడ్ గ్రూప్ డైట్

కార్బ్స్ కావలసిందే!

కార్బ్స్‌ను పూర్తిగా దూరం పెట్టేసే డైట్ ట్రెండ్‌ను విస్తృతంగా అనుసరించేవాళ్లున్నారు. కానీ శక్తిని సమకూర్చే పిండిపదార్థాలను పూర్తిగా మానేస్తే శరీరానికి శక్తి సమకూరేదెలా? మంచి, చెడు పిండిపదార్థాల్లో వేటిని ఏ పరిమాణంలో తీసుకోవాలో అవగాహన ఏర్పరుచుకుని తదనుగుణంగా మసలుకోవాలి.

పిండిపదార్థాలు ప్రధాన పోషకాలు. మనం రోజూ తీసుకునే ఆహారంలో 70% పిండిపదార్థాలే ఉంటాయి. జీర్ణవ్యవస్థ పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తుంది. కాబట్టి శక్తినిచ్చే పిండిపదార్థాలు పూర్తిగా మానేయడం అవివేకం.


పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం
- మలబద్ధకం
- తలనొప్పి
- నోటి దుర్వాసన
- వాంతులు
- పోషకలోపం

డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులు శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.



మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో....

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.

పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో....

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయిలు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.

భూ సమస్యల వెల్లువ

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు

● స్వీకరించిన కలెక్టర్, డీఆర్వో



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: కలెక్టర్ కార్యాలయంలోని సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 215 వినతులు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 137 రాగా, డీఆర్‌డీఏ 13, మున్సిపల్ శాఖకు 9, విద్యుత్ శాఖ 6, మిగిలిన వినతులు వివిధ శాఖలు నుంచి వచ్చాయి. వచ్చిన వినతులను కలెక్టర్ అంబేడ్కర్, డీఆర్వో అనిత ఉన్నారు. వినతుల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

గత ప్రభుత్వహయంలో భూములు రీసర్వే చేయడం వల్ల తమకు ఉన్న జిరాయితీ భూమి బంజరు భూమిగా నమోదైంది. దీనిపై గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వం నుంచి ఆప్షన్ వచ్చే వరకూ మార్పు చేయడం కష్టమని అధికారులు తెలిపారు. కొత్తవలస మండలం నిమ్మలపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లలో ఉన్న భూమిని మా అమ్మకు మా తాత నుంచి గిఫ్ట్ డీడ్ ద్వారా 2019 దఖలు పడింది. వారసత్వంగా ఉన్న జిరాయితీ భూమిని బంజరు భూమిగా ఎలా మార్పు చేశారో తెలియడం లేదు. ఎఫ్‌సీవో, ఎస్ఎఫ్‌సీ రికార్డుల్లో జిరాయితీగా ఉండి, రీసర్వేలో బంజరు భూమిగా రికార్డుల్లో మార్పు చేయడం చాలా అన్యాయం. దీని వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని కొత్తవలస మండలం నిమ్మలపాలెం గ్రామానికి చెందిన బి.రాజు విన్నవించుకున్నారు.

● పూసపాటిరేగ మండలం రెల్లివలస రెవెన్యూ పరిధిలో, కుమిలి రెవెన్యూ పరిధిలో ఉన్న సుమారు 40 ఎకరాలు భూమిని చదును చేసుకుని సాగు చేస్తున్నాం. ఈ భూమికి సుమారు రూ. 15 లక్షలు ఖర్చు చేసి అంతా బాగు చేసుకున్నారు. అయితే దీనిని కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై గతంలో ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశాం. ఇకనైనా అధికారులు స్పందించి తాము సాగు చేస్తున్న భూమికి పట్టాలు మంజూరు చేయాలని పూసపాటిరేగ మండలం బొర్రావాని పాలెం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ● భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్టు నిర్మాణానికి అమటాం రావివలస రెవెన్యూ పరిధిలో వివిధ సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 25 ఎకరాలకు, అలాగే బైరెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న పలు సర్వే నెంబరుల్లో దాదాపు 16 ఎకరాల భూమిని సంతకాలు చేసి ఇచ్చారు. 2 సంవత్సరాల క్రితం భూమిని ఇస్తే ఇప్పటి వరకూ పరిహారం మంజూరు చేయలేదు. తమ భూములను జీఎంఆర్, ఎల్ ఎన్‌టీ సంస్థకు చెందిన వారు ఆక్రమించి తమను భయపెడుతున్నారని, వెంటనే పనులు నిలిపివేసి పరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కోరారు. ● విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021 నుంచి 2024 మధ్యకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్ల ద్వారా నిధులు మంజూరు చేసింది. అప్పటికే కార్పొరేషన్‌లో ఉన్న పాత నిల్వలు, కొత్త నిల్వలు కలిసి రూ.104 కోట్లు ఖర్చు చేశారు. ఆయా నిధులను మాజీ ఎంఎల్‌ఏ ఆదేశాలను అనుసరించి వారి ఇష్టాను సారం నామినేటెడ్, టెండర్లు పద్ధతితో కార్పొరేషన్ వారి నిబంధనలకు విరుద్ధంగా పట్టణ సుందరీకరణ పేరుతో పనులు చేసి ఖర్చు చేశారు. అయితే చేపట్టిన పనుల్లో అవినీతి జరిగింది. దీనిపై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. తక్షణమే విచారణ చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కాళ్ల గౌరీశంకర్ ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి న్యాయం చేయాలని ఆదేశించారు. భూ తగాదాలకు సంబంధించి 9, కుటుంబ కలహాలకి సంబంధించి 8, మోసాలకు పాల్పడినవి 10, ఇతర విషయాలకు సంబంధించి 19 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జి.మురళీ, ఎస్‌బీ సీఐలు విజయనాథ్, ఏవీ లీలారావు, ఎస్ఐ మురళీ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఎస్పీని కలిసిన జనసేన నాయకులు

క్రైం: ఎస్పీ వకుల్ జిందాల్‌ను జనసేన నాయకులు గురాన అయ్యలు ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టి, జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయదారులపై ప్రత్యేక దృష్టిసారించి ఎనలేని కృషిచేస్తున్నారని, శాంతి భద్రతల మెరుగుదలకు చర్యలు చేపడుతున్నారని గురనా అయ్యలు అభినందించారు. జనసేన కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా జీవిత బీమా వారోత్సవాలు

దాసన్నపేట: నగరంలోని ఎల్.ఐ.సీ బ్రాంచ్ కార్యాలయంలో 68వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ తిరుమల ప్రసాద్ హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. పాలసీదారులకు మెరుగైన సేవలు అందించటంలో ఎల్ఐసీ సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫెస్ట్‌లోగో ఆవిష్కరణ

విజయనగరం క్రైం: మత్తు పదార్థాలను నిర్మూలించాలి అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్‌సింగు స్టూడెంట్స్ ఫెస్ట్ లోగోని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత డ్రగ్స్ మహ్మామారి బారిన పడకుండా, సమాజం బాధ్యత తీసుకోవాలన్నారు. డ్రగ్స్ నిర్మూలన మార్గం కల్చరల్ ఈవెంట్స్ అని తెలుపుతూ, ఎస్ఎఫ్ఐ ఇటువంటి ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాము, వెంకటేష్‌లు మాట్లాడుతూ, ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు గురజాడ కళాక్షేత్రంలో ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు చిన్నబాబు, రవికుమార్, సమీరా, వాసు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పీడు మ్యాథ్స్‌లో ప్రతిభ

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని హూల్‌బాగ్‌కు చెంది కోడూరు విశ్వజిత్ శ్వేతాచలపతి పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. గుంటూరులో ఆదివారం జరిగిన స్పీడు మ్యాథ్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం సాధించాడు. గత ఏడాది ఒకటో తరగతిలో ఉన్నప్పుడు కూడా విశ్వజిత్ స్పీడు మ్యాథ్స్‌లో పలు బహుతులను సాధించాడు. 8 నిమిషాల వ్యవధిలో 200 కూడికలు, తీసివేతలు, గుణకారాలు చేయగలగడంలో విశ్వజిత్ దిట్టగా నిరూపించుకున్నాడు. విశ్వజిత్ లెక్కల్లో చురుకుదనం ప్రదర్శిస్తుండడంతో ఆ రంగంలో మరింతగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని తల్లిదండ్రులు తెలిపారు.

గ్రామాల్లో వైద్య బృందం పరిశీలన

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం, ఎల్.కోట గ్రామాల్లో సోమవారం పీహెచ్‌సీ వైద్య బృందం డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలతుండడంతో పారిశుధ్యంపై దృష్టి సారించారు. సచివాలయ సిబ్బందిని సమన్వయ పరుస్తూ అన్ని పంచాయతీలు ఎప్పటికపుడు పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

సంతకవిటి: మండలం రామారాయపురం గ్రామంలో నీటిలో మునిగిన వరి పంటను జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తేజేశ్వరరావు, కె.లక్ష్మణరావు, రాజాం వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, మండల వ్యవసాయ అధికారి నవీన్ విస్తరణ అధికారి గోవిందరావు సోమవారం పరిశీలించారు. నీట మునిగిన వరి పంట విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పంటలపై పిచికారి చేయాల్సిన మందులను గురించి సూచించారు.

అత్యధిక సభ్యత్వం గల పార్టీ బీజేపీ

కొత్తవలస: ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం గల రాజకీయ పార్టీగా బీజేపీకి గుర్తింపు ఉందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తవలసలో శృంగవరపుకోట నియోజకవర్గానికి సంబంధించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సారథ్యంలోని పార్టీ అత్యంత బలంగా ఉందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు దానేష్, పార్లమెంటరీ నియోజక వర్గ ఉపాధ్యక్షురాలు సీహెచ్ జగదీశ్వరి, నియోజకవర్గ కో కన్వీనర్ సీహెచ్ అప్పారావు, మాన్యం దేముడు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్లకు కలెక్టర్ అభినందన

విజయనగరం టౌన్: జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభి నందించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు సోమవారం వెళ్లి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పోషకాహార కార్యక్రమం

బొబ్బిలి: పోషకాహార మాసోత్సవంలో భాగంగా సోమవారం ఇందిరమ్మకాలనీ యూపీహెచ్‌సీలో ఐసీడీఎస్ పీవో జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.సాయికుమార్ మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివ రించారు. వార్డు కౌన్సిలరు తెంటు పార్వతి చేతుల మీదుగా గర్భిణులకు సీమంతం చేశారు.

నేడు కొత్తపేటలో కృష్ణాష్టమి 'ఉట్లు' సంబరం

విజయనగరం రూరల్: నగరంలోని కొత్తపేట, కోదండ రామాలయంలో కృష్ణజన్మాష్టమి నవరాత్రి ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'ఉట్లు' సంబరం జరగనుంది. మధ్నాహ్నం 4 గంటలకు రామాలయం వద్ద జరిగే సంబరం అనంతరం కృష్ణుని తిరువీధి ఊరేగింపు చేయనున్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో రాధా కృష్ణులు, కోలాటం, మేళతాళాలు, సాము తదితర వాటితో జరగనుందని ఉత్సవ కమిటీ తెలిపింది. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందజేయనున్నామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

విజయనగరం క్రైం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ ప్రతినిధులు సాయి రెడ్డి, కొసరాజు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం నెల్లిమర్ల గౌడౌన్ వద్ద బెవరేజెస్ కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన మద్యం పాలసీ, నాణ్యమైన మద్యం ఇస్తామని చెబుతున్నారు తప్ప షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగం విషయంలో ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 15 వేల కుటుంబాలు వీధిన పడతాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని తెలియజేయాలన్నారు. స్పందించని ఎడల ఈ నెల 7న ప్రభుత్వ మద్యం షాపులు బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. యూనియన్ ప్రతినిధులు మధుసూదన రావు, వసాది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఐఎంఎల్ డిపో వద్ద మద్యం దుకాణ సిబ్బంది నిరసన

ఓపీఎస్ కోసం ఏపీటీఎఫ్ నిరసన

బొబ్బిలి: సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక గాంధీ విగ్రహం ముందు ఏపీటీఎఫ్ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు, బి.పద్మావతి నాయకత్వంలో ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దారు ఎం.శ్రీనుకు మెమోరాండం అందజేశారు. సీపీఎస్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. దుర్మార్గపు పింఛన్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బి.జోగినాయుడు, ప్రవీణ్‌కుమార్, లక్ష్మణరావు, ఆర్ఎస్ రాజు, బాలకృష్ణ, రామకృష్ణ, వెంకటరావు, రాము తదితరులు పాల్గొన్నారు.



గాంధీవిగ్రహం ముందు నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజేతలకు అభినందనలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్: ఇటీవల అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన 11వ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన 26 మంది క్రీడాకారులు పతకాలు సాధించడంతో, వారంతా కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజును సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలికలు విభా గంలో 22 పతకాలు, బాలుర విభాగంలో 16 పతకాలు సాధించారని కోచ్‌లు అశోక్ గజపతిరాజుకు వివరించారు. పతకాలు సాధించిన బాలబాలికలను ఆయన అభినందించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు.

లోతట్టు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

రేగిడి: క్యాచ్‌మెంట్ ఏరియాలో మరో రెండురోజులు వర్షాలు పడే సూచనలు ఉన్న నేపథ్యంలో మండలంలో 12లోతట్టు గ్రామాలను అప్రమత్తం చేసినట్టు తహసీల్దార్ ఎల్లారావు తెలిపారు. మండలంలో నదీతీర ప్రాంతాలైన బొడ్డవలస, రేగిడి, పుర్లి, గదబపేట, వెంకటాపురం, ఖండ్యాం, రేగిడి, పాతచెలిగానలవస తదితర లోతట్టు గ్రామాల్లో దండోరవేసి అప్రమత్తం చేసినట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే ఆయా వీఆర్వోలు, వీఆర్ఏలకు రాత్రివేళల్లో డ్యూటీలు వేసినట్లు చెప్పారు. అలాగే మండలకేంద్రంలో ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

వీవోఏలకు ఆరు నెలల బకాయి చెల్లించాలి

కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 6 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే మంజూరు చేయాలని వీవోఏలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వీవోఏలు బ్రాతురుంలు, మరుగుదొడ్డిలు, క్లీనింగ్‌తోపాటు తరగతి గదులు శుభ్రం చేస్తున్నారని, వీరికి జీతాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. జీతం 6 వేల నుంచి 12 వేలకు పెంచాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ రెండున సామూహిక సత్యాగ్రహ దీక్ష చేపడతామన్నారు.

రెల్లి ఉపకులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరిగితే, రెల్లి ఉపకులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరాంధ్ర రెల్లి ఉప కులాల పోరాట సమితి నాయకులు సోము రాంబాబు, శివప్రసాద్, సోము మహేష్, వెంకటరాజు డిమాండ్ చేశారు. సోమవారం రెల్లి ఉపకులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ లంకాపట్టణం అంబేడ్కర్ విగ్రహం నుంచి పుచ్చలవీధి, పాత బస్టాండ్, గంటస్తంభం, వెంకటలక్ష్మి థియేటర్ మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ జంక్షన్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహా నికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ రెల్లికులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరు అంబేడ్కర్‌కు వినతిపత్రం అందించారు.

పాడి రైతులకు అండగా పశువైద్య శాఖ

భామిని: పశువులు పెంపకం పాడి రైతులకు పశువైద్య శాఖ అండగా ఉంటుందని ఆ శాఖ జేడీ మన్మథరావు పేర్కొన్నారు. సోమవారం భామిని వచ్చిన ఆయన విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. స్థానిక రైతులు జేడీతో మాట్లాడుతూ పశువైద్య అధికారిని నియమించాలని కోరారు. పశువైద్యాధికారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. జేడీ స్పందిస్తూ వారానికి మూడు రోజులు వైద్యాధికారిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న వైద్య భవనాన్ని రైతు సేవా కేం ద్రంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మూగజీవాలకు బీమా చేయించాలని పాడి రైతులకు సూచించారు. ఆయనతో ఏజేడీ శ్రీనివాసరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' వెంటనే అమలు చేయాలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మున్నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ శీను కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మున్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ రాకముందే రైతులకు వ్యవసాయ పంట పెట్టుబడి సాయం అందించేదన్నారు. ప్రస్తుతం రైతులు పెట్టుబడులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రెడ్డి సత్యంనాయుడు, కార్యదర్శి చుక్క సన్యాసిరావు, రైతులు తదితురులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కౌన్సిలింగ్ క్లాసులు నిర్వహించాలి

కలెక్టరేట్: విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే విధంగా వారానికి ఒక గంట పాటు కౌన్సిలింగ్ క్లాసులను నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. 8, 9, 10వ తరగతులు ఎంతో కీలకమని, ఈ దశలో విద్యార్థులను సక్రమ మార్గంలో నడిచేటట్టు చూడాలని ఆయన సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఈవోలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో ప్రేమకుమార్, జిల్లా బీసీ సంక్షేమాధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవలపై ఫిర్యాదులు వస్తే చర్యలు

కలెక్టరేట్: నెట్వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలపై రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అంబేడ్కర్ హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. జిల్లాలో 23 నెట్వర్క్ ఆసుపత్రులుండగా గత 8 నెలల్లో 32 ఫిర్యాదులు అందా యని, వీటిల్లో ఎక్కువ కేసులు లబ్ధిదారులు నుంచి డబ్బులు తీసుకుని, మళ్లీ రిఫండ్ చేశారని జిల్లా కోఆర్డినేటర్ అప్పలరాజు కలెక్టర్‌కు వివరించారు. డబ్బులు ఎందుకు తీసుకోవల్సి వచ్చిందని, ఎందుకు రిఫండ్ చేయాల్సి వచ్చిందని కలెక్టర్ ప్రశ్నించారు. ఆసుపత్రుల యజమానులు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ బిల్లులు జిల్లాలో సుమారు రూ.70కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

దత్తిరాజేరు: మండలంలోని స్టేషన్ బూర్జివలస, చౌదంతివలస గ్రామాల సమీపాన జాతీయ రహదారిపై లారీ ఢీకొని ఒకరు మృతిచెందిన సోమవారం చోటుచేసుకుంది. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు కే.కృష్ణాపురం గ్రామానికి చెందిన సారిక గోవింద(55) వ్యక్తిగత పనుల నిమిత్తం ఆరిక తోట వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బొబ్బిలి నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. ప్రమాదంలో గోవింద తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన క్షతగాత్రుడిని 108లో గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. డ్రైవర్ అజాగ్రత్తవల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య రవణమ్మ, వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య రవణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏకలవ్య విద్యార్థికి విషపురుగు కాటు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థికి విషపురుగు కాటేసింది. సోమవారం ఉదయం పాఠశాల పరిసరాల్లో హారిక వరుణ్ కాలకృత్యాలు తీర్చుకుంటుండగా పాము కాటేసిందనే అనుమానంతో పాఠశాల సిబ్బందికి చెప్పాడు. వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ లచ్చన్న విద్యార్థిని భద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని అబ్జర్వేషన్ నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇది పాము కాటా లేదా.. ఏదైనా విషపురుగు కరిచిందా అన్న విషయాన్ని వైద్యులు ధ్రువీకరించలేదు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా విద్యార్థి కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ఏదో కరిచిందని చెప్పాడని, వెంటనే ఆసుపత్రిలో చేర్పామన్నారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి భద్రగిరి ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. పూర్తిస్థాయి వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. వైద్యులను వివరణ కోరగా విద్యార్థికి ఎటువంటి ప్రమాదం లేదని, ముందు జాగ్రత్త చర్యగా పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

రేగిడి: మహిళ మెడలో పుస్తెలతాడును దుండగులు తెంపుకుపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రేగిడి ఏఎస్ఐ రాజారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం ఉణుకూరు గ్రామానికి చెందిన మజ్జి భారతి తోటి కూలీలతో సోమవారం ఉదయం గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వస్తుండగా రోడ్డుపై నడుస్తున్న భారతిని ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు దుండగులు వెంబడించి వెనకనుంచి తులంన్నర పుస్తెలతాడును తెంపుకుని పారిపోయారు. ఆమె కేకలు వేసినా చుట్టు పక్కల ఎవ్వరూ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. దీంతో ఈమె రేగిడి పోలీస్‌లను ఆశ్రయించింది. ఏఎస్ఐ రాజారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం.. ఐదుగురి అరెస్టు

నెల్లిమర్ల: నెల్లిమర్లలో గంజాయి విక్రయిస్తున్న విజయనగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వీరి వద్ద గంజాయిని కొనుగోలు చేస్తున్న మరో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. నెల్లిమర్ల పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లిమర్ల పూడమ్మ తల్లి ఆలయానికి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్ఐ డి.రామగణేష్, సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని గంజాయి అమ్మకం చేస్తున్న విజయనగరానికి చెందిన దువ్వ సుబ్బు, వానపల్లి బలరామ్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1 కిలో 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనుగోలు చేస్తున్న విజయనగరానికి చెందిన మరో ముగ్గురు యువకులు చిలకా పాల్, పొడుగు అనిల్, మహ్మద్ జాఫర్‌లను అదుపులోకి తీసుకుని వీరందరిపై కేసు నమోదుచేసి రి మాండ్‌కు తరలించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజా యి తరహా నిషేధిత మత్తు పదార్థాలను వినియోగించినా, అమ్మకం చేసినా, కొనుగోలు చేసినా కఠిన శిక్షలు తప్పవన్నారు. నెల్లిమర్ల ఎస్ఐ డి.రామగణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

రోడ్డు మరమ్మతు పనులు పరిశీలించిన బేబీనాయన



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి, సెప్టెంబరు 2: బాడంగి మెయిన్‌రోడ్డులో మూడుచోట్ల దెబ్బతిన్న ఆర్ఎంసీ రోడ్డును బొబ్బిలి బేబీనాయన తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. సోమవారం ఎమ్మెల్యే స్వయంగా వచ్చి జేసీబీతో పనులు చేయించారు. ఈ పనులు మొత్తాన్ని స్థానిక సర్పంచ్ కండి రమేష్‌కు అప్పజెప్పినట్టు చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏపీసీ బ్యాంకు ఎదురుగా పాత సినిమాహాలు దగ్గర పాత వెలుగు ఆఫీసు సమీపంలో మూడుచోట్ల భారీగా రోడ్డు కోతకు గురై కనీసం మోటారు సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీన్ని తీసుకున్న స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా యుద్ధ ప్రాతిపదికన సొంత నిధులతో పనులు చేయించారు. ఎస్ఐ తారకేశ్వరరావు తన సిబ్బందితో మరమ్మతులను దగ్గరుండి పర్యవేక్షించడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు రవిబాబు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, లచ్చుపతుల సత్యం, తెంటు వెంకటేష్, గుణుపూరు శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సూర్యారావు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బేబీనాయన పరామర్శ

బాడంగి: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పూడివలసలో మాజీ సర్పంచ్ పూడి సూర్యనారాయణ కుటుంబ సభ్యులను, గజరాయనివలస వైస్ సర్పంచ్ కామినాయుడు తల్లి ఇటీవల మృతిచెందగా ఇరు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా బేబీనాయన వాళ్లతో మాట్లాడుతూ సహాయ సహకారాలు ఏంకావాలన్నా చేస్తానన్నారు. సూర్యనారాయణ మృతి పార్టీకి తీరనిలోటని ఆయన అన్నారు. టీడీపీ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన వెంట పార్టీ ప్రెసిడెంట్ రవిబాబు, గజరాయనివలస ఎంపీటీసీ పాలవలస గౌరు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, సర్పంచ్ మూడడ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు నివాళి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



ఎస్.కోట: పండ్లు పంపిణీ చేస్తున్న కడుబండి



బొబ్బిలి: నివాళులు అర్పిస్తున్న శంబంగి



రాజాం రూరల్: వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తలే రాజేష్



చీపురుపల్లి: వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



నెల్లిమర్ల: వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

విశాఖలో వృద్ధురాలికి పింఛన్ అందజేత

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామానికి చెందిన వికలాంగ వృద్ధురాలు దత్తి రతీదేవి, నడవలేని పరిస్థితుల్లో తమ కుమార్తె నివాసముంటున్న అక్కయ్యపాలెం, విశాఖపట్నంలో ఉంటున్నారు. ఆ వృద్ధురాలి పింఛన్ ఆగిపోకూడదని 110 కిలోమీటర్లు ప్రయాణించి ఆమెకు వైజాగ్‌లో సచివాలయ విద్యాసంక్షేమ సహాయకులు ఈకేవైసీ పూర్తిచేసి, సోమవారం 4 వేల రూపాయలు అందించారని. పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు తెలిపారు.

తెగుళ్ల నివారణకు కషాయాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం బూర్జవలస గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు ఆధ్వర్యంలో రైతులకు పంటలో తెగుళ్ల రాకుండా పంట ఎదుగుదలకు, పురుగు నివారణకు వాడే నీమాస్త్రం, జిల్లేడు కషాయం తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో చీడపీడల నివారణకు కషాయాలు ఉపయోగం వివరించి వాటి తయారీ విధానం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రావణి, పంచాయతీ సెక్రటరీ తులసి, ఎల్టూ శంకరరావు, ఐసీఆర్‌పీఎస్ కన్నంనాయుడు, రైతులు సత్యవతి, శ్రీరాములు తదుతురులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కువగా భూ సమస్యలపై, కుటుంబ తగాదాలు, ఆన్‌లైన్ మోసాలు తదితర సమస్యలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ బీఎండీ ప్రసాద్ రావు, ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.

రూ.19కే మారిషస్ పైనాపిల్ మొక్క

సీతంపేట: మారిషస్ పైనాపిల్ మొక్క రూ.19కు అందించేలా టెండర్ ఖరారైనట్టు ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యానవనాల అధికారి వెంకట గణేష్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మొత్తం 7.20 లక్షల మొక్కలు అవసరం ఉందని, దీనికి సంబంధించి 11 మంది టెండర్లలో పాల్గొనగా మొక్కలు డిమాండ్ ఉన్న దృష్టిలో ఉంచుకుని 11 మందికి టెండర్లు భాగస్వాములు చేస్తూ మొక్కలు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. 100 రోజులు ప్రణాళికలో భాగంగా ఈనెల 20వ తేదీ నటికి పైనాపిల్ మొక్కలు సరఫరా చేయాల్సి ఉందన్నారు. మొక్క 8 నుంచి 15 ఆకులు వచ్చే విధంగా అడుగు పొడవు పరిమాణం ఉండే విధంగా నిబంధనలు విధించామని చెప్పారు. భామిని, సీతంపేట మండలాల్లో 90 ఎకరాల విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా మారిషస్ పైనాపిల్ మొక్కలు పెంపకం చేపట్టామని తెలిపారు. టెండర్‌లో పాల్గొన్న కమిటీ నిర్ణయం మేరకు రూ.19 ధర నిర్ణయించినట్టు చెప్పారు. ఈ మొక్కలు ఎలా పెంచాలనే దానిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నాగావళికి వరద


స్పిల్‌వే నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి సోమవారం వరద ప్రవాహం అధికంగా చేరింది. ఆదివారం ప్రాజెక్టు పరిధిలో సుమారు 4,500 క్యూసెక్కులకు పైగా వరద చేరింది. ప్రస్తుతం సోమవారం 8 వేల క్యూసెక్కులకు పైగా వరద నదిలో చేరుతోంది. అల్పపీడనం కారణంగా గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు వరద అధికంగా చేరుతుండటంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకుగాను 104.09 మీటర్ల మేర నీటి నిల్వ సామర్థ్యం నెలకొంది. అలాగే 2.534 టీఎంసీలకుగాను 1.949 టీఎంసీల నిల్వ ఉంది. అలాగే సాగునీటి అవసరాలకు 1010 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రవాహం అధికంగా వచ్చినట్లయితే నదీ తీర ప్రాంతవాసులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని ప్రాజెక్టు డీఈ టి.రఘునాధనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ భద్రత దినోత్సవం

సీతానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏఈ ఎ.జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ భద్రత దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 2వ తేదీన విద్యుత్ భద్రత దినోత్సవం సందర్భంగా విద్యుత్ పరికరాలపై విద్యుత్ సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించి, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉన్నతి' ఆటోలు మంజూరు

గరుగుబిల్లి: పేదింటి ఎస్సీ, ఎస్టీ మహిళలకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి (మహిళా శక్తి) పథకం కింద ఆటోలు మంజూరు చేసిందని టీడీపీ నాయకుడు మర్రాపు పురుషోత్తంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు తెలిపారు. మండలంలోని పెద్దూరు, నాగూరు, సంతోషపురం, లఖనాపురం, వల్లరిగుడబ గ్రామాలకు చెందిన మహిళలకు మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఆటోలను మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వారు సోమవారం ప్రారంభించారు. వారితో పాటు అంబటి తవిటి నాయుడు, కోట భరత్‌కుమార్, ముదిలిబాబు విజయ వాంకుశం ఉన్నారు. వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, సర్పంచ్ రౌతు గోవిందనాయుడు, టీడీపీ నాయకులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సాలూరు రూరల్: శ్రావణ మాసం ఆఖరి సోమవారం, అమావాస్య కావడంతో శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. శివునికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. పంచముఖేశ్వర, నగేశ్వరస్వామి, ఏకామ్రనాథ్, ఉమారామలింగేశ్వర, కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక సీమంతాలు


సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: సంపూర్ణ పోషణ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి పాల్గొన్నారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పౌష్టికాహార నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నోడల్ అధికారిణి కె.రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రౌతు లక్ష్మి, పి.అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజిలెన్స్‌కు చిక్కిన జూనియర్ ఇంజినీరు

ఒడిశా

రాయగడ: రోడ్డు నిర్మాణ పనుల కూలీల వేతనం కోసం రూ.25వేలు లంచం తీసుకుంటూ ఓ జూనియర్ ఇంజినీరు అవినీతి నిరోధక శాఖాధికారులకు చిక్కాడు. దీనిపై విజిలెన్స్ డీఎస్పీ అరుణ్‌కుమార్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాశీపూర్ సమితి కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ ఇంజినీర్ పూర్ణచంద్ర చౌదరి.. రోడ్డు నిర్మాణ పనుల కూలీల వేతనం సొమ్ము రిలీజ్ చేసేందుకు ఓ గుత్తేదారు నుంచి రూ.25వేలు లంచం తీసుకుంటుండగా రాయగడలోని తన నివాశంలో పట్టుబడ్డాడు. ఈమేరకు గుత్తేదారుని ఫిర్యాదు మేరకు అవినీతి నిరోధక శాఖాధికారులు అతని ఇంటిలో సోదాలు నిర్వహించా రు. సోదాల్లో రూ.14లక్షల 81వేల 300 లెక్కకు దొరకని నగదు లభించింది. ఆస్తులకు సంబంధించి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా సోదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం చౌదరి అనారోగ్యం నెపంతో ఆసుపత్రిలో చేరారు.

రైల్వే జీఎంను కలిసిన ఎంపీ

రాయగడ: కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉలకా భువనేశ్వర్‌లో ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్‌ను సోమవారం కలిశారు. రాయగడ డివిజన్ పనులపై చర్చించారు. తెరుబలి-గుణుపూర్ రైలు ప్రాజెక్టులో పద్మాపూర్‌ను కూడా కలపాలని, త్వరగా రాయగడలో డీఆర్ఎంను నియమించాలని కోరారు. వృద్ధులకు రైలు టిక్కట్లపై రాయితీ ఇవ్వాలని, నత్తనడకన సాగుతున్న రాయగడ డివిజన్ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని ఉలకా తెలిపారు.

పవన్‌కల్యాణ్ అభిమానుల రక్తదానం

రాయగడ: పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో డా.ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్, పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు అభిమానులు పాల్గొని, రక్తదానం చేశారు. మొత్తం 30 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. తొలుత అభిమానులు పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు.

క్రమశిక్షణగల నటుడు బాలకృష్ణ

రాయగడ: నందమూరి బాలకృష్ణ క్రమశిక్షణగల నటుడు అని వక్తలు అన్నారు. బాలకృష్ణ 50 ఏళ్ల సినీ జీవితాన్ని పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం రాయగడలో నందమూరి అభిమానుల సంఘం సభ్యులు స్వర్ణోత్సవాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రాము అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో పట్టణంలోని పలు థియేటర్లకు చెందిన యజమానులు అమర్‌నాథ్ కుముందాన్, కరుణాశంకర్, ఉదయ్‌కుమార్ కుముందన్, శ్రీనివాస కుముందాన్, సాయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యజమానులకు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

వేతనాలు పెంచాలి

- ఆశా వర్కర్ల ఆందోళన
- డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేత


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

బెలగాం: ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని గత ఏడాది ఫిబ్రవరి 9న నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలకు జీవోలు విడుదల చేయాలని ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో కె.విజయ పార్వతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శివాని మాట్లాడుతూ పని చేయని మొబైల్ ఫోన్లతో పని చేయాలంటే ఆశాలు ఇబ్బందిపడుతున్నారని, వెంటనే మంచి ఫోన్లు అందజేయాలని కోరారు. ఒప్పంద జీవోలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకురాళ్లు ఇందిరా, కన్నతల్లి, కృష్ణవేణి, పద్మశాంతి తదితరులు పాల్గొన్నారు.

నార్లవలస పంచాయతీని విభజించండి


ఎంపీడీవో పార్వతికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన నేతలు

సాలూరు రూరల్: నార్లవలస పంచాయతీని విభజించి మరో పంచాయతీని ఏర్పాటు చేయాలని జిల్లేడువలస, మూలవలస తదితర గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు వంతల సుందరరావు మాట్లాడారు. నార్లవలస పంచాయతీలో ఉన్న పలు గ్రామాలు పంచాయతీ కేంద్రానికి సుదూరంలో ఉన్నాయని చెప్పారు. పంచాయతీ కేంద్రానికి వెళ్లడానికి గిరిజనులు వ్యయప్రయాసలకు లోనవుతున్నారన్నారు. నార్లవలస పంచాయతీని విభజించి పెద్దవలస పంచాయతీగా భరణికివలస, పెద్దవలస, బొడ్డపాడు, మూలవలస, జిల్లేడువలస, దబ్బాచదును సీతన్నదొరవలస గ్రామాలను కలిపి ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. నూతన పంచాయతీ ఒక్కటే ఆయా గ్రామాల గిరిజనులకు మేలు చేయగలదని తెలిపారు. గతంలో పాచిపెంట మండలంలో మంచాడవలసను ఏర్పాటుచేసిన విషయం గుర్తు చేశారు. అనంతరం ఎంపీడీవో గొల్లపల్లి పార్వతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మర్రి శ్రీనివాసరావు, గాసి వంశీ, కోమన్న తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సాంబమూర్తి


గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న సాంబమూర్తి

కొమరాడ/ జియ్యమ్మవలస: గిరిజన ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారని, వెంటనే గిరిజన గ్రామాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, లేదంటే ఆందోళన చేసి తీరుతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి హెచ్చరించారు. సోమవారం కొమరాడ మండల కేంద్రంలో ఆయన గిరిజనులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రభుత్వ వైద్యులు తూతూ మంత్రం వైద్యాలకు జ్వరాలు తగ్గకపోవడంతో ప్రైవేటు వైద్యులను సంప్రదించి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరికొందరు గిరిజనులు మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా కేంద్రాసుపత్రికి జ్వరాలతో వెళితే హిమోగ్లోబిన్ తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని, డోనర్లు కావాలని గిరిజనులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా రని అన్నారు. తీరా డోనర్లు తీసుకురాకపోతే విజయనగరం మహారాజా ఆసుపత్రికి గానీ, విశాఖపట్నం కేజీహెచ్‌కు గానీ రిఫర్ చేసి నిర్లక్ష్యంగా పొమ్మంటున్నారని ఆయన ఆరోపించారు. సోమవారం నయా పంచాయతీ సుంకేసు, గుడ్డం గ్రామానికి చెందిన గిరిజనులు తమ పిల్లల వైద్యం నిమిత్తం కొమరాడ మండల కేంద్రంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి ఆటోలో తీసుకురావడం నిజంగా ఆందోళన కలిగించే విషయమన్నారు. వెంటనే ప్రభుత్వం గిరిజన ప్రాంతాలన్నీ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, ఆయా గ్రామాల్లోనే గిరిజనులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద తీవ్ర ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను జిల్లా వ్యాప్తంగా టీడీపీ, జనసేన నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. రక్తదాన కార్యక్రమాలు నిర్వహించారు. (ఆంధ్రజ్యోతి బృందం)


కురుపాం: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, టీడీపీ నేత వీరేశ్


పాలకొండ: ఎమ్మెల్యే జయకృష్ణకు కేక్ తినిపిస్తున్న జనసేన నాయకులు


సాలూరు రూరల్: వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేత భంజ్‌దేవ్, తదితరులు


పార్వతీపురంటౌన్: మొక్క నాటుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, జనసేన నాయకులు


కురుపాం రూరల్: మొండెంఖల్ ఆస్పత్రి ప్రాంగణంలో..


జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలిలో కేక్‌తో జన సైనికులు


భామిని: పాలవలసలో మొక్కలు నాటుతున్న దృశ్యం


గరుగుబిల్లి: నాగూరులో మొక్కలను పంపిణీ చేస్తున్న సత్యనారాయణ, అశోక్‌కుమార్

కురుపాం: కురుపాంలో జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేష్, నియోజకవర్గ కన్వీనర్ ఎన్.వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పాల్గొని కేక్‌కట్ చేశారు. అనంతరం కురుపాం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ● **గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌దేవ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కడ్రక మల్లేష్, సర్పంచ్ బి.గౌరీశంకరరావు పాల్గొన్నారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. ● **సీతంపేట:** పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జయకృష్ణ ప్రారంభించారు. హిమరిక పవన్, సవర తోటముఖలింగం, కె.సుబ్బారావు, తోటపల్లి మాజీ చైర్మన్ పాండురంగ, సంధ్యారాణి పాల్గొన్నారు. ● **పాలకొండ:** స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జనసేన నాయకులు గర్భాన సత్తిబా బు, పొట్నూరు రమేష్, జామి అనీల్, ప్రశాంత్, జనసేన జానీ పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** వీరఘట్టం అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే జయకృష్ణ పాల్గొన్నారు.

వేడుకల్లో వైసీపీ నాయకులు

సాలూరు రూరల్: సాలూరులో టీడీపీ నాయకులు నిర్వహించిన పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పలువురు వైసీపీ నాయకులు హాజరయ్యారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి, జనసేన నేత గొర్లె తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్న ఈ వేడుకల్లో వైసీపీ జిల్లా కార్యదర్శి జరజాపు సూర్యనారాయణ, మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్ రాపాక మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం పంచాయతీ పరిధిలో ఉన్న తన స్వగృహంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవిబోను చంద్రమౌళి, బార్నాల సీతారామ, గొట్టాపు వెంకటనాయుడు, వంగపండు త్రినాథ ఉన్నారు.

చదువులో రాణించాలి


స్టాక్ రూంను పరిశీలిస్తున్న ఏపీవో

సీతంపేట రూరల్: గిరిజన విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఐటీడీఏ ఏపీవో చినబాబు అన్నారు. మండలంలోని దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, స్టాక్ రిజిస్టర్, స్టోర్‌రూంలోని నిత్యావసర సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారా.. లేదా.. అని ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్ఎం నారాయణరావుకు సూచించారు. ఈ పరిశీలనలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో విజయభారతి

గరుగుబిల్లి: గ్రామాల్లో రైతులు ప్రకృతి విధానంలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యపడతాయని మండల వ్యవసాయ అధికారిణి ఆర్.విజయభారతి అన్నారు. సోమవారం సంతోషపురంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు ఆమె పంటల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌కు వర్షాలు అనుకూలంగా ఉన్నాయని, దీని కారణంగా పలు చీడపీడలు ఆశించే పరిస్థితి ఉందన్నారు. రైతులు విధిగా పంటలను పరిశీలించి తెగుళ్లు ఉన్నట్లయితే సిబ్బందికి తెలియపర్చాలన్నారు. వరికి సంబంధించి కాలిబాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన ఇల్లు పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని జోబుగూడ, వంజరాపుగూడ గ్రామాల్లో తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇంటిగోడలు కూలడంతో ఈ విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అక్కడకు వెళ్లి పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వంతో చర్చించి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అప్పారావు, పాడి సుదర్శన్‌రావు, పార్టీ మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, ఆర్ఐ గిరిబాబు, వీఆర్వోలు గణపతి, గౌరమ్మ, టీడీపీ నాయకులు బుజ్జేశ్వరావు, లోవరాజు, రామారావు, నమ్మధ పాల్గొన్నారు.

పసుపు జిగురు పళ్లాలను వినియోగించండి


సుభద్రలో పసుపు జిగురు పళ్లాలపై అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రావణ్‌కుమార్

సీతానగరం (బలిజిపేట): వరి వ్యవసాయ క్షేత్రాల్లో పసుపు జిగురు పళ్లాలు ఏర్పాటుతో పురుగు మందుల వాడకం తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం బలిజిపేట మండలం సుభద్ర గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంతో ఏర్పాటుచేసిన పసుపు జిగురు పళ్లాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు రంగును ఎక్కువగా పురుగులు ఆకర్షిస్తాయని, ఈ రంగులో ఉన్న అట్టలు పైన ఇరువైపులా జిగురు రాయడం వల్ల పొలంలో తిరిగే పురుగులు వాటికి తగిలి అంటిపెట్టుకుని, ఎగరలేక చనిపోతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హేమంత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మితిరుపతి, గంగమ్మ, ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వీడిన కంటైనర్ మిస్టరీ

సాలూరు రూరల్: సాలూరు పట్టణం శివారులోని గాంధీనగర్ వద్ద గత కొన్ని రోజులుగా నిలిపిఉంచిన కంటైనర్ మిస్టరీ వీడింది. ప్రస్తుతం ఎక్కడికక్కడే గంజాయి రవాణా జరుగుతున్న తరుణంలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఈ కంటైనర్ కొన్ని రోజులుగా ఇక్కడే నిలిపిఉంచడంతో పలు అనుమానాలకు తావిచ్చింది. ఎట్టకేలకు సోమవారం సాలూరు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు ఈ కంటైనర్‌ను తెరిచారు. అయితే ఈ కంటైనర్ ఖాళీగా ఉండడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మరింత క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందని సీఐ తెలిపారు.

క్లుప్తంగా..

గుంతలు పూడ్చిన పోలీసులు

సీతానగరం: మండలంలోని పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న పెద్ద పెద్ద గోతులను ఎస్పీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోమవారం కాంక్రీటుతో పూడ్చివేశారు. అలాగే మండల కేంద్రంలోని బజారులోగల రోడ్డును కూడా మరమ్మతులు చేశారు.

కూర్మరాజుపేటలో ఎన్వీబీడీ అధికారి పర్యటన

సాలూరు రూరల్: కూర్మరాజుపేటలో నేషనల్ విక్టర్‌బుల్ డిసీజ్ కన్సల్టెంట్ (ఎన్వీబీడీ) రామచంద్రరావు సోమవారం పర్యటించారు. గ్రామంలో మలేరియా పాజిటివ్ వచ్చిన విద్యార్థి ఇంటికెళ్లి వివరాలను తెలుసుకున్నారు. వైద్య సేవలపై మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివకుమార్‌ను ఆరా తీశారు. అలాగే గ్రామంలో జ్వరాలు పరిస్థితిపై వైద్య సిబ్బంది సాయిమురళిని అడిగారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించగా ఎటువంటి జ్వరాలు నమోదు కాలేదని వైద్యాధికారి శివకుమార్ తెలిపారు.

జ్వరాలపై అప్రమత్తం

గరుగుబిల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నామని వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ తెలిపారు. జ్వరాలతో బాధపడుతున్న పలువురికి సోమవారం స్థానిక పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటి తనిఖీలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

వైఎస్సార్‌కు నివాళి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళావతి, మాట్లాడుతున్న రాజన్నదొర

సీతంపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం సీతంపేటలో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వి.కళావతి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పాలకొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, వెంకునాయుడు, కోటేశ్వరరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** సాలూరులో సోమవారం నిర్వహించిన వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఎంపీపీ రాములమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

జిల్లాలు దాటి పింఛన్ల పంపిణీ



విశాఖలో, రాజాంలో పింఛన్లు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

సాలూరు రూరల్: వివిధ సమస్యలతో ఇతర జిల్లాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పింఛన్‌దారులకు స్థానిక సచివాలయ సిబ్బంది సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. శివరాంపురానికి చెందిన జరజాపు లక్ష్మి కుమారుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. తన కుమారుడుకు సపర్యలు చేస్తూ ఆమె అక్కడే ఉన్నారు. ఆమె వద్దకు శివరాంపురం డిజిటల్ అసిస్టెంట్ నూకరాజు వెళ్లి పింఛన్ మొత్తం అందించారు. అదే గ్రామానికి చెందిన కరిబుగత ఆదమ్మ నడవలేని స్థితిలో విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నారు. విశాఖలో ఉంటున్న ఆమెకు ఆయన పింఛన్ మొత్తం అందించారు. అలాగే విశాఖ టీబీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోను నరసింగరావు వద్దకు వెళ్లి పింఛన్ అందించారు. జీగిరాంకు చెందిన లోమిసి వెంకటరరావు విజయనగరం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎముకలకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. జీగిరాంకు చెందిన నల్లబిల్లి గణపతి, కుమారిలు రాజాం లో చికిత్స పొందుతున్నారు. వారి వద్దకు జీగిరాం సచివాలయ మహిళా పోలీసు విజయ వెళ్లి పింఛను అందించారు.